సాక్షి
విశాఖపట్నం

I

శనివారం ၊ 22 ၊ జూలై ၊ 2023

న్యూస్‌రీల్

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



కేంద్ర కారాగారంలో ఖైదీతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి శేషమ్మ

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ సందర్శించారు. ఖైదీల సంఖ్య, కల్పిస్తున్న సౌకర్యాలను జైలు సిబ్బంది వివరించారు. అనంతరం జైల్‌లో ఖైదీలతో ఆమె మాట్లాడారు. జైల్‌లో కల్పిస్తున్న సౌకర్యాలు, వైద్య సేవలు, ఆహారం, తదితరవాటిపై ఆరా తీశారు. అవసరమైనవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఖైదీలకు సూచించారు. ఆమెతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వినతులను సత్వరమే పరిష్కరించాలి



సిబ్బంది సమస్యలు వింటున్న సీపీ

దొండపర్తి (విశాఖ దక్షిణ): పోలీస్ సిబ్బంది వినతులను పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం. త్రివిక్రమ్ వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సీపీ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆరుగురు సిబ్బంది తమ వినతులను కమిషనర్‌కు అందించారు. ఇందులో క్వార్టర్స్ రద్దు చేసి హెచ్‌ఆర్‌ఏ మంజూరు చేయాలని, ఆరోగ్య సమస్యలు దృష్ట్యా లా అండ్ ఆర్డర్‌లో కొన్ని రోజులు నైట్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఆస్పత్రి బిల్లుల రీయింబర్స్‌మెంట్‌లో జాప్యం జరుగుతోందని సీపీకి విన్నవించారు. వీటిన్నింటినీ పరిశీలించిన సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు రోజ్‌గార్ మేళా

హాజరుకానున్న కేంద్ర మంత్రి కపిల్

దొండపర్తి(విశాఖ దక్షిణ): కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రోజ్‌గార్ మేళా పోర్టు కళావాణి ఆడిటోరియంలో శనివారం కస్టమ్స్, పరోక్ష పన్నుల కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి కేంద్ర పంచాయతీరాజ్ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 9.20 గంటలకు జరిగే కార్యక్రమంలో వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ లెటర్స్‌ని కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందించనున్నారు.

విభాగాధిపతుల బాధ్యతల మార్పు

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం హిందీ విభాగాధిపతి బాధ్యతల నుంచి ఆచార్య నల్ల సత్యనారాయణను మార్పు చేస్తూ ఏయూ అధికారులు నిర్ణయం తీసకున్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దాదాపు ఐదేళ్ల కాలంగా ఆచార్య సత్యనారాయణ విభాగాధిపతిగా కొనసాగుతున్నారు. దీంతో ఆయనను విభాగాధిపతిగా తొలగించి, బాధ్యతలను ప్రిన్సిపాల్‌కు అప్పగించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తెలిపారు. థియేటర్ ఆర్ట్స్ విభాగాధిపతిగా కూడా ఆచార్య సత్యనారాయణను మార్పుచేస్తూ బాధ్యతలను ప్రిన్సిపాల్‌కు అప్పగించారు.

చదువు పూర్తయ్యేసరికి ఉద్యోగం

మద్దిలపాలెం: ప్రభుత్వ కళాశాల్లో చదివే ప్రతి విద్యార్థి డిగ్రీ పట్టాతోపాటు ఉద్యోగం పొందేలా మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్. పోలా భాస్కరరావు అన్నారు. డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో శుక్రవారం కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ , ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న విద్యకు సార్థకత కావాలంటే ఉద్యోగం రావాలన్నారు. ఆ ఉద్యోగాలను విద్యార్థులు చదవే కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నాయన్నారు.ఆర్జేడీ ఎస్.శోభారాణి మాట్లాడుతూ జాబ్ మేళాలలో 12 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. 11 వందల మంది విద్యార్థులు హాజరుకాగా..244 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ డాక్టర్. అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ ఐ. విజయ బాబు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయి చైతన్య, చాముండేశ్వరి పాల్గొన్నారు.

Foodies Destiny

సిటీలో ఈట్ స్ట్రీట్స్







- యూరోపియన్ స్టైల్‌లో..
- సాగర్‌నగర్, డిఫెన్స్ కాలనీలో ఏర్పాటు
- రూ.6.24 కోట్లతో అత్యాధునికంగా నిర్మాణం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

చల్లనిగాలి..సముద్ర అందాలు.. ఇష్టమైన ఆహారం..లైఫ్ బిందాసే కదా..అటువంటి యూరోపియన్ ఫుడ్‌స్టైల్స్ ఇక విశాఖలో నోరూరించనున్నాయి. ఇష్టమైన వంటకాలను తినాలనే కోరిక ఉండే ఆహారప్రియుల కల త్వరలో నెరవేరనుంది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ యూరోపియన్ స్టైయిల్‌లో 'ఈట్ స్ట్రీట్స్'ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సాగర్‌నగర్ వద్ద ఒకటి, డిఫెన్స్ కాలనీ వద్ద మరొకటి ఏర్పాటుకు సిద్ధమయ్యింది. ఇందుకు అనుగుణంగా టెండర్లను కూడా ఆహ్వానించింది. ఈట్ స్ట్రీట్స్ పేరుతో అందమైన ఆర్ట్స్‌తో ఆహార ప్రియులను ఆహ్వానించనున్నాయి. మొత్తం రూ.6.24 కోట్లతో అభివృద్ధి చేయనున్న ఈట్ స్ట్రీట్స్.. వైజాగ్ వాసులకు కొత్త వంటకాల రుచులను పరిచయం చేయనున్నాయి.





ఆధునిక పద్ధతిలో..

ఆధునిక పద్ధతిలో ఈట్ స్ట్రీట్స్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ప్రజలు పెద్దగా ఉపయోగించని ప్రదేశాలను ఇందుకోసం ఎంపిక చేశాం. యూరోపియన్ స్టైల్‌లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచించాం. వెరైటీ వంటకాలకు ఈట్ స్ట్రీట్స్ కేంద్రంగా మారనున్నాయి. నగరవాసులు ఆహ్లాదంగా సేద తీరేందుకు ఈట్ స్ట్రీట్స్ రానున్న రోజుల్లో దోహదం చేయనున్నాయి.

– సాయికాంత్ వర్మ, జీవీఎంసీ కమిషనర్

నగర వాసుల కోసం

ప్రజలకు ఎప్పటికప్పుడు కొంగొత్తగా విశాఖ నగరాన్ని పరిచయం చేసేందుకు జీవీఎంసీ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే వైఎస్సార్ వ్యూ పాయింట్‌తో పాటు రోడ్లు, ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మెరిడీయన్ అభివృద్ధి చేస్తున్నాం. కొత్త బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నాం. రానున్న రోజుల్లో మరింతగా నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ఆహార ప్రియులకు కొంగొత్త వంటకాలతో పాటు ప్రశాంతమైన వాతావరణంతో ఈట్ స్ట్రీట్స్‌ను అభివృద్ధి చేస్తున్నాం. అధునాతన పద్ధతిలో అభివృద్ధి చేయనున్న ఈట్ స్ట్రీట్స్ నగర వాసులను ఆకట్టుకోనున్నాయి. టెండర్లు పూర్తి అయిన తర్వాత 6 నెలల్లో వీటిని ఏర్పాటు చేయనున్నాం.

– గొలగాని హరి వెంకట హరికుమారి, జీవీఎంసీ మేయర్

రూ. 6.24 కోట్లతో..

వాస్తవానికి ఈట్ స్ట్రీట్స్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ ఎప్పటి నుంచో భావిస్తోంది. అయితే, ఇప్పటివరకు అడుగు ముందుకు పడలేదు. ఈ నేపథ్యంలో పార్క్ హోటల్‌కు ఎదురుగా ఉన్న డిఫెన్స్ కాలనీ వద్ద, సాగర్‌నగర్‌లో ఒకటి ఏర్పాటు చేసేందుకు తాజాగా జీవీఎంసీ అడుగులు వేసింది. డిఫెన్స్ కాలనీ వద్ద రూ. 3.24 కోట్ల వ్యయంతో, సాగర్‌నగర్ వద్ద రూ.మూడు కోట్ల వ్యయంతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. యూరోపియన్ స్టైయిల్‌లో ఈ ఈట్ స్ట్రీట్స్‌ను అభివృద్ధి చేయనున్నారు. 6 నెలల కాలంలో పూర్తి చేయాలని భావిస్తోంది.

అన్ని వేళల్లో అందుబాటులో..

జీవీఎంసీ ఏర్పాటు చేయనున్న ఈట్‌స్ట్రీట్స్‌ను ఆధునిక పద్ధతిలో అభివృద్ధి చేయనున్నారు. మనకు కావాల్సిన వివిధ రకాల వంటకాలు ఇక్కడ లభించడంతో పాటు అప్పటికప్పుడు మన కళ్ల ముందే తయారుచేయడాన్ని కూడా ఎంజాయ్ చేసే వీలు కలగనుంది. అంతేకాకుండా విశాలమైన స్థలం...ప్రశాంతంగా వంటకాలను ఆస్వాదించడం ఇక్కడి ప్రత్యేకత. రాత్రి, పగలు అనే తేడా లేకుండా అన్ని సమయాల్లో అందుబాటు ఉండనుంది. ఇష్టమైనవి తింటూ..కూల్ డ్రింక్స్ తాగుతూ ఎంజాయ్ చేసేలా అభివృద్ధి చేసేందుకు జీవీఎంసీ తీర్చిదిద్దనుంది. ఈట్‌స్ట్రీట్స్ డిజైన్లను కూడా ఇప్పటికే జీవీఎంసీ తయారు చేసింది. మొత్తంగా విశాఖ వాసులకు త్వరలో వెరైటీ వంటకాల కోసం ఈట్ స్ట్రీట్స్ అందుబాటులోకి రానున్నాయి.



మగ్గానికి మహర్దశ

- లబ్ధిదారులకు వైఎస్సార్ నేతన్న నేస్తం
- జిల్లాలో ఏడుగురికి రూ.1.68 లక్షల పంపిణీ



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం : చేనేత కార్మికులు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా 2023 సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా లబ్దిదారులకు వరుసగా 5వ విడత నగదు సాయం పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తిరుపతిలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి కలెక్టర్, సంబంధిత అధికారులు, లబ్ధిదారులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం జిల్లా స్థాయిలో లబ్దిదారులకు నేతన్న నేస్తం సాయమందించారు. జిల్లా పరిధిలో ఏడుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.24 వేలు చొప్పున రూ.1.68 లక్షల చెక్కును కలెక్టర్ అందించారు. ఈసందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి చేనేత కుటుంబానికి మగ్గం ఆధునికీకరణ, నూలు కొనుగోలు తదితర అవసరాల కోసం ఏటా సాయమందిస్తోందని తెలిపారు. అర్హత ఉండి ఎవరికైనా లబ్ధి అందకపోతే సమీపంలో ఉన్న సచివాలయం సిబ్బందిని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ అసిస్టెంట్ డైరెక్టర్లు మురళీకృష్ణ, పద్మ, డెవలప్‌మెంట్ అధికారి రమణి, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జోడుగుళ్లపాలెం బీచ్ క్లీనింగ్ రేపు

మహారాణిపేట: సాగరతీర స్వచ్ఛతలో భాగంగా ఆదివారం జోడుగుళ్లపాలెం బీచ్‌ను శుభ్రం చేయనున్నారు. జిల్లా అధికారయంత్రాంగం ప్రతి నెలా ఓ ఆదివారం బీచ్‌లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గత ఏడాది మే నుంచి ఇప్పటి వరకు 12 విడతులగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి 8 వరకు నిర్వహించనున్న సాగర తీర స్వచ్ఛతకు ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ మల్లికార్జున ఓ ప్రకటనలో కోరారు.

హోంగార్డ్స్ ఆర్ఐ స్వర్ణలతకు బెయిల్ మంజూరు

విశాఖ–లీగల్ : రెండు వేల రూపాయల నోట్ల మార్పిడి కేసులో అరెస్టు అయిన హోంగార్డ్స్ ఆర్ఐ స్వర్ణలతకు బెయిలు మంజూరు అయ్యింది. ఈ మేరకు నగరంలోని ఒకటో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ శుక్రవారం బెయిలు మంజూరు చేశారు. నెల రోజుల క్రితం నోట్ల మార్పిడి కేసులో సీఐ స్వర్ణలతను నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేసిన సంగతి విధితమే. కేసును పరిశీలించిన న్యాయమూర్తి స్వర్ణలత బృందానికి షరతులతో కూడిన బెయిల్ ఇచ్చారు. పోలీసులకు అందుబాటులో ఉండాలని, కోర్టు పిలిచినప్పుడు రావాలని ఆదేశించారు. రూ.10 వేల పూచీకత్తుతో పాటు ఇద్దరు హామీని సమర్పించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు.

పవన్‌ను అరెస్టు చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు

సీతంపేట (విశాఖఉత్తర): పవన్‌కల్యాణ్ పబ్లిసిటీ కోసం మాట్లాడుతున్నారని, వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో వలంటీర్లు మానసికంగా బాధపడ్డారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వీ సుబ్బారెడ్డి అన్నారు. పవన్‌ను అరెస్టు చెయ్యాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. నగరంలోని స్వర్ణభారతి స్టేడియంలో శుక్రవారం జాబ్‌మేళాను ప్రారంభించిన ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ ఎవరో రాసిన స్క్రిప్ట్ చదువుతున్నాడని, వలంటీర్లపై అసత్య ప్రచారం చేస్తే ప్రభుత్వం ఊరుకోదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సెప్టెంబర్‌లో విశాఖ రానున్నారని మీడియా అడిగిన ప్రశ్నకు సమధానమిచ్చారు. పార్టీని నమ్ముకున్నవారికి అన్యాయం జరగదని. పదవులు వాటంతట అవే వస్తాయని తెలిపారు. కోలా గురువులకు విశాఖ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడం బీసీలకు ఇచ్చిన గౌరవమన్నారు. బీసీలంటే జగన్‌మోహన్‌రెడ్డికి అభిమానమని పేర్కొన్నారు.

ఐటీ హబ్‌గా విశాఖ అభివృద్ధి

- టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- స్వర్ణభారతి స్టేడియంలో జాబ్‌మేళా ప్రారంభం



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గురువులు

సీతంపేట(విశాఖ ఉత్తర): ఐటీ హబ్‌గా విశాఖపట్నం అభివృద్ధి చెందుతోందని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఎడ్జ్‌ఫ్లెక్స్ అండ్ నాలెడ్జి హట్ అప్‌గ్రాడ్ సంస్థ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగే గ్రూప్ స్నాప్ ఫెస్ట్ జాబ్‌మేళాను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా ఇటువంటి జాబ్‌మేళాలు దోహదపడతాయన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని నిరుద్యోగులకు శిక్షణ, ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పిస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నగరాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలని కృషి చేస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగా ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ తన కార్యకలాపాలను ప్రారంభించడానికి చురుగ్గా ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఐటీ రంగానికి ఉపయోగపడేలా దక్షిణ భారతదేశంలోనే మొదటిసారిగా అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు భూమి పూజ చేసినట్టు గుర్తు చేశారు. అనంతరం ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు, నిరుద్యోగులకు రూ.20 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లు అందజేశారు. జాబ్‌మేళాలో పాల్గొన్న 20కి పైగా కంపెనీలు 500 మందికి ఉద్యోగాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎడ్జ్‌ఫ్లెక్స్ అండ్ నాలెడ్జి హట్ అప్‌గ్రాడ్ ప్రతినిధులు బి.వేదవ్యాస్‌రెడ్డి, డి.గౌతం, ఏపీఈఐటీఏ జనరల్ సెక్రటరీ వి.శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఎం.వి.పవన్‌కార్తీక్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎంగా సౌరభ్ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సౌరభ్ ప్రసాద్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి పదోన్నతిపై బదిలీ అయ్యారు. 1991 ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ బ్యాచ్‌కు చెందిన సౌరభ్ ప్రసాద్ సెంట్రల్ రైల్వే, వెస్టర్న్ రైల్వే, వెస్ట్ సెంట్రల్ రైల్వే, కొంకణ్ రైల్వేలలో వివిధ హోదాలలో పని చేశారు. ఇక్కడ డీఆర్‌ఎంగా చేరకముందు సౌరభ్ ప్రసాద్ సెంట్రల్ రైల్వేలో చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజినీర్‌గా పనిచేశారు. సౌరభ్ ప్రసాద్ కెరీర్‌లో ముంబయి నుంచి పలు వందేభారత్ రైళ్లను ప్రారంభించారు. ముంబయిలో అడిషనల్ డీఆర్‌ఎంగా ఉన్నప్పుడు ముంబయి సబ్ అర్బన్, స్టేషన్‌ల ఆధునికీకరణ, సుందరీకరణ వంటి పనులు చేపట్టారు. కొంకణ్ రైల్వే పరిధిలో పనిచేసే సమయంలో దేశీయంగా, అంతర్జాతీయంగా చేపట్టిన పలు వ్యాపార, అభివృద్ధి ప్రాజెక్టులలో కీలకపాత్ర పోషించారు.



అనూప్‌కుమార్ సత్పతి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తొలిసారిగా ప్రభుత్వ ఉద్యోగులకు గ్రీవెన్స్



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఒక వేదిక ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకాలకు అనుగుణంగా తొలిసారిగా ఉద్యోగుల గ్రీవెన్స్‌ను నిర్వహించినట్లు కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన 125 మంది ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డా.మల్లికార్జున మాట్లాడుతూ సమస్యలున్నా విధి నిర్వహణపై ఏ ఉద్యోగి అలసత్వం చూపకూడదని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి, వీఎంఆర్‌డీఏ సెక్రటరీ రంగయ్య, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం తీవ్రతరం

మేధావులు, న్యాయవాదులు, కార్మిక నాయకుల పిలుపు



సంఘీభావం ప్రకటిస్తున్న కార్మిక నాయకులు

సీతంపేట(విశాఖ ఉత్తర): విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 890 రోజులుగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని పలువురు వక్తలు ధ్వజమెత్తారు. ప్లాంట్ పరిరక్షణకు ప్రస్తుతం చేస్తున్న పోరాట స్థాయి సరిపోదని, మరింత ఉధృతం చేయాలని అభిప్రాయపడ్డారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో విశాఖ పౌర గ్రంథాలయంలో మేధావులు, వైద్యులు, న్యాయవాదులు, పాత్రికేయులతో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పోరాట కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.నరసింగరావు మాట్లాడుతూ పథకం ప్రకారం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేస్తోందన్నారు. సీనియర్ జర్నలిస్ట్ వి.వి.రమణమూర్తి, ప్లాంట్ యూనియన్ నాయకులు మంత్రి రాజశేఖర్, బార్ అసోసియేషన్ ప్రతినిధి సిహెచ్.రాంబాబు, ప్రొఫెసర్ జార్జి విక్టర్, సీనియర్ పాత్రికేయుడు శివశంకర్, ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ లజపతిరాయ్, వైస్ చైర్మన్ వై.దేముడుబాబు, ప్రొఫెసర్ వీర్రాజు, రైల్వే యూనియన్ పి.రామమోహన్‌రావు, పోరాట కమిటీ ప్రతినిధులు పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

స్టార్ హోటల్స్‌కు జీవీఎంసీ ప్రశంసాపత్రాలు



హోటల్స్ ప్రతినిధులతో మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ చేస్తున్న ప్రయత్నానికి నగరంలోని హోటల్స్ సహకారం అవసరమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు సహకరిస్తున్న నోవాటెల్, రాడిసన్‌బ్లూ, గ్రాండ్ బే, గేట్‌వే, ది పార్క్, డాల్ఫిన్, ఫోర్‌పాయింట్స్, ఫెయిర్ ఫీల్డ్స్ హోటల్స్ ప్రతినిధులకు ఎకో–ఫ్రెండ్లీ వైజాగ్ ధ్రువపత్రాలను మేయర్ అందజేశారు. అంతేగాక ప్లాస్టిక్ నిషేధానికి సహకరిస్తున్న ప్రతి చిన్న, పెద్ద హోటల్స్‌ను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరు సతీష్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, కార్పొరేటర్ మహ్మద్‌సాధిక్ పాల్గొన్నారు.

నగర కూడళ్లలో 'ఎకో' హోర్డింగ్‌లు

చిన్నారులు గీసిన చిత్రాలకు ప్రత్యేక స్థానం

- వినూత్న కార్యక్రమం చేపట్టిన జీవీఎంసీకి నగర ప్రజల కితాబు





సంపత్ వినాయగర్ ఆలయం రోడ్డు, అంబేడ్కర్ కూడలి వద్ద సీనియర్స్, జూనియర్స్ విభాగంలో మొదటి స్థానాల్లో నిలిచిన విద్యార్థులు గీసిన చిత్రాలతో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు

డాబాగార్డెన్స్: విశాఖ మహా నగరాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో ప్రజలను భాగస్వాములను చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తోంది. ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఎకో వైజాగ్ పేరిట ఐదు థీమ్స్‌తో చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేసింది. విజేతలు గీసిన చిత్రాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేసింది. 30 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తులో క్లాత్ బ్యానర్లతో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు నగర ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. సీనియర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన శివ శివాని హైస్కూల్ విద్యార్థి సీహెచ్ వర్షిత్ గీసిన చిత్రాన్ని సంపత్ వినాయక ఆలయం వద్ద, జూనియర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన టైనీ టాయ్ అండ్ జాయ్ హైస్కూల్ విద్యార్థి వై.తరణి గీసిన చిత్రాన్ని డాబాగార్డెన్స్ రోడ్డులో అంబేడ్కర్ కూడలి వద్ద ఏర్పాటు చేశారు. మిగిలిన స్థానాల్లో నిలిచిన విద్యార్థులు గీసిన చిత్రాలను ద్వారకానగర్ ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద, ఎల్ఐసీ బిల్డింగ్ వెనుక రోడ్డులో, రైల్వే న్యూకాలనీ రైల్వే క్లబ్ వద్ద, పాత గాజువాక జంక్షన్‌లో ఏర్పాటు చేశారు. వీటిని తిలకించిన విజేతల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. వినూత్న కార్యక్రమం చేపట్టిన జీవీఎంసీకి కృతజ్ఞతలు చెబుతూ.. పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని స్పష్టం చేశారు.

బాధ్యత గుర్తు చేసేందుకే..



భావి పౌరులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు వారికి తమ బాధ్యతను గుర్తు చేసే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించాం. విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. దాదాపు 30 వేల మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగం ప్రొఫెసర్లు విజేతలను ఎంపిక చేశారు. ఇటీవల మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించాం. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు.. విజేతలు గీసిన చిత్రాలను ముఖ్య రోడ్లు, కూడళ్ల వద్ద హోర్డింగ్‌ల రూపంలో ఏర్పాటు చేశాం.

– సాయికాంత్ వర్మ, కమిషనర్ జీవీఎంసీ

విద్యార్థి దశ నుంచే అవగాహన



నగర పరిశుభ్రత, పర్యావరణ రక్షణకు విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తే.. మంచి ఫలితాలు సాధించవచ్చు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేందుకు చిత్రలేఖన పోటీలు నిర్వహించాం. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు నగర ప్రజల సహకారం అవసరం. విశాఖ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

సెమ్స్‌లో యువతకు ఉచిత శిక్షణ

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సింధియాలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్(సెమ్స్) సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సెమ్స్ సీవోవో గోపీకృష్ణ శివం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 23 ఏళ్ల వయసు కలిగి ఐటీఐ వెల్డర్, ఫిట్టర్, టర్నర్, డిప్లమో మెకానికల్ కోర్సు చేసిన గ్రామీణ నిరుద్యోగ యువతకి వెల్డింగ్ టెక్నాలజీ, సీఎన్‌సీ మెషీన్ ఆపరేటర్ కోర్సుల్లో నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ కోర్సులో ఐటీఐ వెల్డర్ చేసిన వారికి, ఫిట్టర్, టర్నర్, మెకానికల్, డిప్లమో మెకానికల్ చేసిన వారికి సీఎన్‌సీ ఆపరేటింగ్ వర్టికల్ మెషీన్ సెంటర్ కోర్సులో శిక్షణ ఇచ్చి.. ఉచిత భోజన వసతి కల్పిస్తామన్నారు. సీడాప్–దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో భాగంగా ఇస్తున్న ఈ శిక్షణ అనంతరం అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న వారు సింధియా జంక్షన్‌లోని సెమ్స్ కేంద్రంలో లేదా 85006 87750లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

వైవీ సుబ్బారెడ్డితో కోలా గురువులు భేటీ



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులు శుక్రవారం టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్ష పదవికి ఎంపిక చేసినందుకు ఆయన వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిర్లక్ష్యానికి విద్యార్థి బలి



చరణ్‌తేజ్ మృతదేహం

కూర్మన్నపాలెం: ఆటోడ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఓ విద్యార్థి మృతి చెందాడు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. పరవాడ మండలం ఈమర్రిపాలెంలో నివాసముంటున్న కుంచా కనకరాజు, లక్ష్మి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు చరణతేజ్(14) ఉక్కు టౌన్‌షిప్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. రోజులాగే చరణ్ తేజ్ శుక్రవారం ఉదయం ఆటోలో స్కూల్‌కు వెళ్లి.. తరగతులు పూర్తయ్యాక సాయంత్రం తిరిగి అదే ఆటోలో ఇంటికి బయలుదేరాడు. అగనంపూడి పరిధి శనివాడ జంక్షన్‌కు వచ్చే సరికి ఆటోడ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో వెనుక కూర్చున్న చరణ్‌తేజ్ రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో బాలుడి తలకు బలమైన గాయం కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని.. బాలుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తండ్రి కనకరాజు సింగపూర్‌లో కూలీ పనులు చేస్తుంటారు.

త్వరలోనే బకాయిలు చెల్లిస్తాం

- ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



మాట్లాడుతున్న ఎండీ తిరుమలరావు

ఎంవీపీకాలనీ: ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం వాల్తేర్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీలో పాత ఈహెచ్ఎస్‌కు బదులుగా కార్పొరేట్ హాస్పటల్ రిఫరల్ పద్ధతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ఏ మాత్రం నష్టం జరగకుండా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. త్వరలోనే ఉద్యోగుల బకాయిలు చెల్లిస్తామన్నారు. ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రమోషన్ల కల్పన దిశగా కృషి చేయాలని కోరారు. ఆర్టీసీలో డ్రైవర్, కండక్టర్లు, మెకానిక్‌ల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. వాల్తేర్ డిపో కార్యదర్శి వసంతరావు, అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి పీవీ మోహన్, జోనల్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, కార్యదర్శి మూర్తి, జిల్లా అధ్యక్షుడు జీఎస్ఆర్ కృష్ణ, కార్యదర్శి బి.నీలకంఠం తదితరులు పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో 450 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. అనంతరం ఎండీ తిరుమలరావు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పయనమయ్యారు. ఆయన ఆదివారం టెక్కలి, పలాస డిపోలను సందర్శిస్తారు.

రౌడీషీటర్‌కు ఆరేళ్ల జైలు



శంకరరావు(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: రౌడీషీటర్ సోహైల్ శంకరరావుకు గాజువాక 13వ అదనపు కోర్టు ఆరేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధించింది. గాజువాక సీఐ లంకా భాస్కరరావు శుక్రవారం తెలిపిన వివరాలివీ.. 2022 సెప్టెంబర్ 21న మధ్యాహ్నం సమయంలో గాజువాకలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌కి వెళ్లిన శంకరరావు మద్యం మత్తులో గొడవ చేశాడు. వ్యాక్సిన్ వేయమని వైద్య సిబ్బందిని కోరగా.. శంకరరావు మద్యం సేవించి ఉండటంతో వారు వ్యాక్సిన్ వేసేందుకు నిరాకరించారు. దీంతో ఆయన వైద్యుడు, వైద్య సిబ్బందిని తిట్టి.. వారిపై దాడి చేశాడు. క్లినిక్‌లో ఉన్న సామగ్రిని ధ్వంసం చేశాడు. ఈ ఘటనపై హెల్త్ సిబ్బంది గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోర్టు లో ఛార్జ్‌షీట్ వేయగా గాజువాక 13వ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ పి.గోవర్ధన్ విచారణ జరిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పావని వాదనలు విన్న తర్వాత శంకరరావుపై నేరం రుజువు కావడంతో.. అతనికి ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధించారు. రిమాండ్ పీరియడ్ మినహా మిగిలిన శిక్షను అతను అనుభవించాల్సి ఉందని పేర్కొన్నారు.

కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు

- కన్‌ఫైన్డ్ స్పేస్ ఎంట్రీ అంశంపై శిక్షణ



మాట్లాడుతున్న శివశంకర్ రెడ్డి

పరవాడ: ఫార్మా రంగంలో కన్‌ఫైన్డ్ స్పేస్ ఎంట్రీ అంశంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శివశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జేఎన్ ఫార్మాసిటీలో పరిశ్రమల శాఖ, ఎంఏఎస్ఆర్ఎం సంయుక్త ఆధ్వర్యంలో కన్‌ఫైన్డ్ స్పేస్ ఎంట్రీ కార్యక్రమంపై ఏర్పాటు చేసిన శిక్షణను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమల కోసం నూతనంగా ప్రవేశపెట్టిన జీవో నంబర్ 10 విధి విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ మాట్లాడుతూ కన్‌ఫైన్డ్ స్పేస్ ఎంట్రీలో జరిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు, విధి విధానాలను వివరించారు. పరిశ్రమల్లో కన్‌ఫైన్డ్ ఎంట్రీలో పనిచేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పి.చిన్నారావు అవగాహన కల్పించారు. వి.పార్థసారథి, ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇమిగ్రేషన్ చట్టాలపై అవగాహన అవసరం

విశాఖ లీగల్: ఇమిగ్రేషన్ చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంపొందించుకోవాలని అంతర్జాతీయ న్యాయవాది కావేటి శ్రీనివాసరావు సూచించారు. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో బ్రోకర్లు తప్పుడు వెబ్‌సైట్లను సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నారని, అలాంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇమిగ్రేషన్‌లో ఇబ్బందులు పడకుండా తాము న్యాయవాదులకు అవగాహన కలిస్తున్నట్లు వివరించారు. విశాఖ బార్ అసోసియేషన్, కావేటి లా ఫర్మ్ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయవాదుల లైబ్రరీ హాలులో శుక్రవారం 'ఇంటర్నేషనల్ లా' అంశంపై సదస్సు జరిగింది. వివిధ దేశాల ఇమ్మిగ్రేషన్ చట్టాలతో పాటు ప్రవాస భారతీయుల న్యాయ వివాదాలు, అంతర్జాతీయ న్యాయవాద వృత్తిలో స్థిరపడాలని యోచిస్తున్న యువ న్యాయవాదులకు ఈ సదస్సులో అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, కోశాధికారి చిగిలిపల్లి భాస్కరరావు పాల్గొన్నారు.

చూపు కోల్పోయిన వ్యక్తికి అరుదైన శస్త్రచికిత్స



రోగితో శస్త్రచికిత్స చేసిన వైద్య బృందం

ఎంవీపీకాలనీ: కంటిచూపు కోల్పోయిన వ్యక్తికి ఎంవీపీకాలనీలోని మెడికవర్ వైద్యులు అరుదైన చికిత్స అందించి నయం చేశారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్వతీపురానికి చెందిన మోహనరావు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని ఎంవీపీకాలనీలోని మెడికవర్ ఆస్పత్రికి తీసుకురాగా.. వైద్యులు చికిత్స అందించి డిశ్చార్జ్ చేశారు. రెండు రోజుల అనంతరం అతనికి కంటిచూపు సమస్య తలెత్తింది. క్రమంగా కంటి చూపు కోల్పోవడంతో తిరిగి మెడికవర్‌కు తీసుకొచ్చారు. కనీసం కళ్లు కూడా తెరవలేని పరిస్థితుల్లో ఉన్న అతనికి సీనియర్ కన్సల్టెంట్ న్యూరో వాస్కులర్ ఇంటర్వెన్షన్ డాక్టర్ సిబాశంకర్ దలైలతో కూడిన బృందం వైద్యం ప్రారంభించింది. అన్ని పరీక్షలు చేసి అనంతరం కరోటికో కావెర్నస్ ఫిస్టులా(సీసీఎఫ్) అనే అరుదైన, సంక్లిష్టమైన న్యూరో వాస్కులర్ వ్యాధికి అతను గురైనట్లు గుర్తించారు. దీంతో ఎంబోలైజేషన్ శస్త్ర చికిత్స ద్వారా ప్రొసీజర్ నిర్వహించి.. కంటి చూపుతో పాటు అతని ప్రాణాలను కాపాడారు. ఈ అరుదైన చికిత్స ద్వారా రోగి పూర్తిస్థాయిలో కోలుకున్నట్లు వైద్యులు వెల్లడించారు.

విగ్రహ నౌకలో ట్రైనీ ఐపీఎస్‌లు



విగ్రహ నౌకలో ట్రైనీ ఐపీఎస్ అధికారుల బృందం

దొండపర్తి: ట్రైనీ ఐపీఎస్ అధికారులు 22 మంది శుక్రవారం విశాఖ కోస్ట్ గార్డ్ కార్యాలయాన్ని సందర్శించారు. మారీటైం సెక్యూరిటీ మాడ్యూల్ శిక్షణలో భాగంగా ఐసీజీఎస్ విగ్రహ నౌకలో ప్రయాణించారు. ఈ సందర్భంగా కోస్ట్‌గార్డ్ బాధ్యతలు, సవాళ్లు, తీరప్రాంత రక్షణకు చేపట్టే చర్యలను కోస్ట్‌గార్డ్ అధికారులు ట్రైనీ ఐపీఎస్‌లకు వివరించారు.